జీవితంలో
పెళ్ళి ఘడియలు
ఆలస్యంగా రావాలని
కోరుకున్న తను
ఏం అయ్యాడు?

# డివిట్ కథ

"ఎక్స్క్యూజ్ మి మేడమ్!" అన్న పిలుపుతో కారు డోర్ తీయబోతున్న వసుంధర తలతిప్పి చూసింది. ఎదురుగా ముడతలు పడిన షర్టు, మాసిన ప్యాంటు, తైల సంస్కారం లేని జుట్టుతో ఒక వ్యక్తి కనిపించాడు.

"అన్నం తిని రెండ్రోజులైంది. దస్ రూపీ వుంటే ఇవ్వండి. తర్వాత ఇచ్చేస్తాను" అడిగాడతను పెరిగిన గడ్డాన్ని చేతివేళ్ళతో నిమురుకుంటూ.

అతనడిగిన తీరుకు వసుంధర ఆశ్చర్యపోతూనే హ్యాండ్ బ్యాగ్ తెరచి చూసింది. కానీ అందులో చిల్లర లేదు అన్నీ పెద్ద నోట్లే వున్నాయి. అదేమాట చెప్పిందతనితో.

"ప్లీజ్ మేడమ్ ప్లీజ్!" అంటూ కుడిచేతిని ముందుకు చాపాడతను. ఆ చేతిమీద అతని పేరు పచ్చపొడిచివుంది.

ఆ పేరు చూసిన వసుంధర ఉలిక్కిపడింది.

"శ...శి...ధ...ర్..."

ఆమె శరీరం ఒక్కసారిగా కంపించింది. అతని కేసి పరిశీలనగా చూసింది.

"అవును... అతనే. ఒకనాడు తన ప్రాణం, తన హీరో, తను ఎన్నో లక్షలసార్లు తలుచుకున్న వ్యక్తి... అతనే... ఇతను మరి ఇలా... ఇలా మతి స్థిమితం లేని మనిషిలా... మైగాడ్!" తల పట్టుకుంది వసుంధర.

"ఏంటి వసూ ఏమైంది?" అంటూ వచ్చిన భర్తను చూసి సర్దుకుంది వసుంధర.

"ఏయ్ రాస్కెల్! ఫో అవతలికి వెధవ న్యూసెన్స్. నీలాంటి వేస్ట్‌గాళ్ళనంతా కాల్చి

## ఎవరికెవరు ఈ లోకంలో...



పారెయ్యాలి'' అంటూ ఆ వ్యక్తిని రఫ్‌గా అవతలికి నెట్టేశాడు వసుంధర భర్త.

''పద వసూ!'' అంటూ కారు స్టార్ట్ చేశాడు. యాంత్రికంగా కారులోకెళ్ళి కూర్చుంది వసుంధర.

ఆలోచనలు ఆమె మెదడులో సుళ్ళు

తిరుగుతున్నాయి. జ్ఞాపకాల పొరలు కదలసా గాయి. శశిధర్ గురించి తను తపించిపోయిన రోజులు గుర్తుకు వచ్చాయి.

వసుంధర, శశిధరల్‌లు ఎమ్.ఎస్సీలో క్లాస్‌మేట్స్. శశిధర్ ఎప్పుడూ తెల్లటి ప్యాంట్‌లో తెల్లటి షర్టు టక్ చేసి కాలేజికి వచ్చేవాడు. స్వచ్ఛమైన మల్లెలాంటి అతని పర్సనాలిటీ అంటే అబ్బాయిలకు అసూయ. అమ్మాయిలకు ఆనందం.

"వైట్ అండ్ వైట్ మీట్ మి నైట్" అంటూ అమ్మాయిలు 'టీజ్' చేస్తుంటే మౌనిలా చిరునవ్వుతో సాగిపోయేవాడు శశిధర్.

శశిధరంటే వసుంధరకు చాలా ఇష్టం. కాలేజీ గేటుదగ్గర అతనికోసం పడిగాపులు కాచేది అతని చూపులకోసం తపించిపోయేది

అతనెప్పుడైనా యథాలాపంగా చూస్తే పరవశించిపోయేది. తన ప్రేమనెలా వ్యక్తం చేయాలా అని ఆలోచిస్తుండేది. శశిధర్ మాత్రం ఆమెను ఎప్పుడూ ప్రత్యేకంగా చూడలేదు. క్లాసులో ఎప్పుడైనా మాట్లాడే సందర్భం వస్తే అది క్లాస్ సబ్జెక్ట్‌లకు పరిమితమైపోయేది.

ఒక రోజు—

సాయంకాలం అయిదయింది. కాలేజి వదిలారు. అమ్మాయిలు, అబ్బాయిలు పంజరం నుండి బయటపడ్డ పక్షుల్లా కేరింతలతో వస్తున్నారు. వసుంధర అందరికంటే ముందుగా వచ్చి గేటు దగ్గర నిలబడింది. కాసేపటి తర్వాత అల్లంత దూరాన వస్తున్న శశిధర్ ఆమె కంటబడ్డాడు. ఎందుకో ఆమె గుండె చిత్రంగా స్పందించసాగింది. పెదవుల్లో వణుకు పుట్టింది. అతనామెను సమీపించగానే ఎలాగో ధైర్యం చేసి అతనికడ్డంగా నిలబడింది. ప్రశ్నార్థకంగా చూశాడు శశిధర్.

"మీతో... మీతో కొంచెం మాట్లాడాలి" అతి ప్రయత్నం మీద పలికింది వసుంధర ఆ మాటల్ని.

"మాట్లాడండి"

"ఇక్కడ కాదు"

"మరెక్కడ"

"వేరేచోట ఎక్కడైనా"

"అయితే పదండి క్లాస్ రూమ్‌లోకెళదాం."

"ఇంకా నయం ప్రిన్సిపల్ రూములోకెళదామనలేదు వట్టి బుద్ధావతారం" అని మనసులోనే విసుక్కుంది వసుంధర. తర్వాతెలాగో కష్టపడి అతన్ని పార్కుకి లాక్కెళ్ళగలిగింది.

పార్కులో ఇద్దరూ ఎదురెదురుగా కూర్చున్నారు. వసుంధర సంభాషణ ఎలా మొదలెట్టాలా అని ఆలోచిస్తూంది. శశిధర్ గడ్డిని పీకుతూ ఆమెకేసి చూస్తున్నాడు.

కాసేపయ్యాక అడిగాడు శశిధర్ "ఏదో మాట్లాడాలని తీసుకొచ్చి ఊరుకున్నారేం?"

వసుంధర తల వంచుకొని చెప్పింది.

"నేను... నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. మీరంటే నాకు చెప్పలేనంత ఇష్టం. నేనంటే మీ కిష్టమేనా?"

ఆమె చెప్పింది విని మౌనంగా ఉండిపోయాడు శశిధర్. కాసేపటి తర్వాత అన్నాడు


"అందమైన జాబిలి కోరి దగ్గరికి వస్తే కాదని ఎవరూ అనలేరు కానీ నేను ప్రాక్టికల్ మనిషిని. జీవితాన్ని వూహల్లోంచి కాక

వాస్తవంనుండి చూడాలని కోరుకుంటాను. ఇప్పుడు నిన్ను నేను ప్రేమిస్తున్నానని చెప్పలేను.

''ఎందుకని?'' వసుంధర కళ్ళలో నీళ్ళు తిరుగుతుండగా అడిగింది.

''నా కుటుంబాన్ని గురించి నా ఆశల గురించి నీకు చెపితే బాగా అర్థమవుతుందనుకుంటాను. నేను మధ్య తరగతి కుటుంబీకుడ్ని. మా నాన్న ఒక సామాన్య గుమాస్తా. మేము అయిదుగురు పిల్లలం. ముగ్గురబ్బాయిలు, ఇద్దరమ్మాయిలు. అందరిలోకి నేనే పెద్దవాడ్ని. మాముందు తరాల్లో పెద్దగా చదువుకున్న వాళ్ళెవరూ లేరు. మా నాన్న కూడా ఎస్సెల్సీ వరకు మాత్రమే చదివాడు. ఆయనకు అంతకుమించి చదివే అవకాశం రాలేదు. అందుకే తన తాహతుకు మించినదైనా నన్ను ఎమ్.యస్సీ చదివిస్తున్నాడు. రేపు నేను ఏదో వుద్ధరిస్తానని వాళ్ళ ఆశ. నేను ఇప్పుడు ప్రేమ అంటూ తిరిగి చదువును నిర్లక్ష్యం చేస్తే దాని పరిణామం వాళ్ళను ఎంత వ్యధకు గురి చేస్తుందో చెప్పలేను. ఒకవేళ మనం ప్రేమించుకొని వాళ్ళ ముందుకు వెళితే కులం, సాంప్రదాయమని వాళ్ళంటారు. ప్రేమ, మనస్సు అని మనమంటాము. చివరికేమౌతుందో!

ఇక నా ఆర్థిక స్థితి గురించి చెప్తాను. నాకున్నవి రెండే రెండు జతలు. అవీ తెల్లరంగులోనే వుంటాయి. ఎందుకంటే నాకున్నవి రెండే జతలు అని తెలియకుండా వుండడానికే నేనుఆ రంగు ఎన్నుకున్నాను. అంతే కాని ఇతర రంగులంటే ఇష్టంలేక కాదు. కానీ అందరూ నాకు తెలుపంటే ఇష్టమనీ అందుకే ఎప్పుడూ వైట్‌లోనే వుంటాననీ అనుకుంటారు. ఇక నా పుస్తకాలకు, ఫీజులకు కావలసిన డబ్బుకోసం నా తల్లిదండ్రులు ఎంత కష్టపడుతున్నారో నాకు తెలుసు. అందుకే నా చదువైపోయాక నా విజ్ఞానాన్ని, తెలివితేటల్ని రంగరించి డబ్బు సంపాదించాలనుకుంటున్నాను. నా తమ్ముళ్ళు, చెల్లెళ్ళు నాలా డబ్బుకోసం



ఇబ్బంది పడకుండా చేయాలని నా ఆశ. నేను ప్రేమ, పెళ్ళి అనే బంధంలో ఇరుక్కుంటే వాళ్ళను సంతోష పెట్టగలనా? సమాజంలో అందరిలాగే స్వార్థ తత్త్వంతో కూరుకుపోకుండా వుండగలనా? అందుకే నా జీవితంలో పెళ్ళి ఘడియలు చాలా ఆలస్యంగా రావాలని కోరుకుంటున్నాను.

ఇవన్నీ విని కూడా నువ్వు ఇంకా నన్ను ప్రేమిస్తానంటే నాకేం అభ్యంతరం లేదు. కానీ నీ ప్రేమ వన్ వే ట్రాఫిక్ అయితే అది నా బాధ్యత కాదు''

శశిధర్ చెప్పిన జీవిత సత్యాల్ని వసుంధర అంత తొందరగా జీర్ణం చేసుకోలేకపోయింది అతన్ని తన మనస్సునుండి చెరిపెయ్యలేకపోయింది. కాలేజీలో వున్నన్ని రోజులు ఆమె చూపులు అతన్నే అనుక్షణం వెంటాడేవి. అతను మాత్రం ఎప్పుడైనా నవ్వేవాడు వేదాంతిలా.

ఎమ్.ఎస్సీ అయిన తర్వాత శశిధర్ కొన్నిరోజులు హోటల్లోను, మరికొన్ని రోజులు పచారీకొట్లోను, ఇంకొన్ని రోజులు ఫ్యాన్సీ స్టోరులోను పనిచేస్తూ కనిపించాడు వసుంధరకు. ఇంత చదువు చదివి ఇలాంటి పనులెందుకు చేస్తున్నావని వసుంధర అడిగిన ప్రశ్నకు అతని సమాధానం.

''డిగ్నిటీ ఆఫ్ లేబర్''

అతనే ఇంకో విషయం కూడా చెప్పాడు

''మనకెలాగూ తప్పకుండా ఉద్యోగాలు వస్తాయనే నమ్మకం లేదు. ఉద్యోగం కోసం ప్రాకులాడ్డా, వచ్చిన తర్వాత ఆ జీతంతో పొట్లుపడే బదులు తెలివినుపయోగించి జీవితంలో పైకి రావడం వుత్తమం. నాలుగు డబ్బులు సంపాదించాలంటే బిజినెస్ చేయాలి. అందుకే ఆ వ్యాపారానుభవం కోసమే నేను ఈ పనులన్నీ చేస్తున్నాను. ఎప్పటికైనా నేను నా ఆశల్ని సాధించుకొంటాను''

ఆ మాటలు చెప్తున్నప్పుడు అతని కళ్ళల్లో మెరుపు కనిపించింది.

ఆ తర్వాత కొన్ని రోజులకు శశిధర్ ఆ వూళ్ళో కనిపించలేదు. వసుంధర అతనికోసం పిచ్చిదానిలా తిరిగింది. చివరికి శశిధర్ కుటుంబం ఆ వూరు వదిలివెళ్ళిపోయిందని తెలిసి ఆమె నిర్వీర్యురాలైపోయింది.

క్రమేపి కాలం ఆమెను శశిధర్ జ్ఞాపకాల నుండి బయటపడేసింది. ఒక లక్షాధికారితో ఆమె పెళ్ళి జరిగింది. అప్పటినుండి ఇప్పటివరకు ఇరవై సంవత్సరాల సుదీర్ఘకాలం గడిచిపోయింది.

వసుంధర శశిధర్‌ను జీవితంలో మళ్ళీ చూస్తాననుకోలేదు. కానీ అతను కనిపించాడు తన వూహలకు భిన్నంగా. అతను ఎంతో ఎత్తుకు ఎదిగిపోయి వుంటాడని తన ఆశల్ని సాధించి వుంటాడని ఆమె ఆశించింది. కానీ అతను ఏమీలేని, ఎవరికీ ఏమీకాని స్థితిలో పిచ్చివాడై రోడ్లమీద అడుక్కుంటూ తిరుగుతూ తనకంటబడతాడని కలలో కూడా వూహించలేదు.

'అతనా విధంగా కావడానికి కారణమెవరు? అతను చదివిన చదువు, సంపాదించిన విజ్ఞానం ఏమైంది? అతని కుటుంబమంతా ఎక్కడుంది? అతన్ని అనాథగా ఎందుకొదిలేశారు?'

కారు ఇంటి ముందు ఆగడంతో వసుంధర తన ఆలోచలనుండి బయటపడింది.

మరుసటిరోజు తను శశిధర్‌ను చూసిన

ప్రవేశానికి వెళ్ళింది వసుంధర. శశిధర్ ఒక బంకుదగ్గర నిలబడుకొని ఎటో చూస్తున్నాడు. వసుంధర కారు దిగి అతని దగ్గరికెళ్ళింది. అతనామెను పట్టించుకోలేదు.

"శశిధర్ ... శశిధర్" అంటూ పిలిచింది. కానీ అతను విననట్టుగా వెళ్ళిపోయాడు. అందరూ తననే చూస్తుండడంతో అక్కడ వుండలేక వచ్చేసింది వసుంధర. ఇంకోరోజు వెళ్ళి ఆ చుట్టుపక్కల వాకబు చేయగా ఆ పిచ్చివాడు ఆ వూళ్ళో వారం రోజుల నుండే కనిపిస్తున్నాడని అంతకుముందు ఎక్కడుండే వాడో తెలియదనీ చెప్పారు.

వసుంధర బజార్లో అడుగు పెడితే శశిధర్ ఎక్కడో ఒక దగ్గర కనిపించేవాడు. అతన్ని చూడగానే ఆమెలో సుడిగాలి హోరు మొదలయ్యేది. ఒక్కసారిగా కళ్ళు నీటితో నిండిపోయేవి.

అతనికెలాగైనా బాగు చేయించాలి కానీ ఎలా? తనుగా చొరవ తీసుకుంటే తన భర్తకు సమాధానం చెప్పుకోవాలి. తనకు చిక్కులేకుండా వుండాలంటే, మనశ్శాంతి దొరకాలంటే అతన్ని బాగుపరచాలనే అపేక్ష వున్న వేరొక వ్యక్తి కావాలి. డబ్బు విషయం తను చూసుకుంటుంది. కానీ అతన్ని అభిమానించి శ్రద్ధ తీసుకునే వ్యక్తి ఎవరున్నారు?'

హఠాత్తుగా వసుంధరకు కృష్ణమూర్తి గుర్తుకొచ్చాడు. కృష్ణమూర్తి శశిధర్ ప్రాణస్నేహితుడు. కాబట్టి శశిధర్ ఇలా మారడానికి గల కారణం కూడా అతనికి తెలిసివుండాలి కానీ ఆ కృష్ణమూర్తిని కనుక్కోవడం ఎలా?

మరుసటిరోజు ఒక స్నేహితురాలిని సంప్రదించి ఆమె అడ్రసుతో ఒక ప్రకటన ఇచ్చింది వసుంధర.

"1968–70 సంవత్సరములలో ఎస్.వి.యూనివర్శిటీలో ఎమ్.యస్సీ ఎలక్ట్రానిక్స్ చదివిన కృష్ణమూర్తి అనే వ్యక్తి వెంటనే ఈ క్రింది అడ్రసుకు రావలెను."

ఈ ప్రకటన ఇంగ్లీషు, తెలుగులో అన్ని దినపత్రికలలో వచ్చేటట్టుగా చేసింది. వారం రోజులు కంటిన్యూగా ఈ ప్రకటన అన్ని



తలనొప్పి

"డాక్టర్‌గారూ! మీరిచ్చిన తలనొప్పి మాత్రలు ఎన్ని వేసుకున్నా తగ్గడం లేదండీ!"

"ఎలా తగ్గుతుందోయ్? నువ్ 'తలనొప్పి మాత్రలు' ఇవ్వమన్నావుగాని 'తలనొప్పిని తగ్గించే మాత్రలు' ఇవ్వమన్లేదుగా?"

"...?!!"

కె.సత్యనారాయణ (హిందూపురం)

దినపత్రికలలో ప్రచురించబడింది. ఈ ప్రయత్నం సఫలమవ్వాలనే ఆశ తప్ప గ్యారంటీ లేదు.

సరిగ్గా పదిరోజుల తర్వాత ఫలితం కనబడింది. కృష్ణమూర్తి ఆ అడ్రసు వెతుక్కుంటూ వచ్చాడు. మొదట అతను వసుంధరను గుర్తించలేదు. కానీ ఆమె చెప్పిన తర్వాత గుర్తుపట్టాడు. తనను పిలిపించిన కారణమడిగాడు కృష్ణమూర్తి. శశిధర్ ఆ వూర్లో వున్నాడని వసుంధర చెప్పగానే అతను ''పూర్ ఫెలో! ఈ వూరు చేరాడన్నమాట'' అని నిట్టూర్చింది.

వెంటనే వసుంధర అతనిపై ప్రశ్నల వర్షం కురిపించింది.

**అనాధగా ఈ స్థితిలో ఎందుకొదిలేశారు? ఈ ప్రశ్నలకు నీవొక్కడివే సమాధానం చెప్పగలవని నీ కోసం ఆ ప్రకటన ఇచ్చాను. నా బాధ మువ్వర్థం చేసుకోగలవనుకుంటాను''**

వసుంధర శశిధర్‌ను ప్రేమించిందనే సంగతి కృష్ణమూర్తికి తెలుసు. అతను నిట్టూర్చి చెప్పడం మొదలుపెట్టాడు.

''శశిధర్ జీవితంలో పైకి రావాలనీ, తన తోడబుట్టిన వాళ్ళను పైకి తీసుకు రావాలనీ, మధ్యతరగతి నుండి మరో మెట్టు పైకి ఎక్కాలనీ శాయశక్తులా ప్రయత్నించాడు. తన తెలివితేటల్ని వుపయోగించి పిల్లలను ఆకర్షించి, అలరించే ఎలక్ట్రానిక్ బొమ్మలను తయారుచేశాడు. బ్యాంకులో లోను తీసుకొన్న చిన్న ఫ్యాక్టరీని స్థాపించాడు. దానిలో తను చిన్న చిన్న పనులు చేసి సంపాదించిన అనుభవాన్ని, కృషిని అణువణువునా పాదిగాడు. అతి తక్కువ కాలంలోనే ఎంతో ఎత్తుకు ఎదిగిపోయాడు. లక్షాధికారి అనే ముద్ర వేయించుకున్నాడు.

ఇద్దరు తమ్ముళ్ళుకూ మంచి ఉద్యోగాలు ఇప్పించాడు. చెల్లెళ్ళకు ఇంతవరకు ఏ అన్న చేయనంత ఘనంగా పెళ్ళిళ్ళు జరిపించాడు. చనిపోయిన తన తల్లిదండ్రులలోటు వాళ్ళకు తెలియకుండా చేశాడు. అప్పటివరకు వాడు తన సుఖం గురించి ఏనాడూ ఆలోచించలేదు. వాడి వయస్సు ముప్పై అయిదుకు చేరుకుంది. అప్పుడు నేను వాడికి ఒక సలహా ఇచ్చి పెద్ద పొరపాటు చేశాను. ఇకనైనా పెళ్ళి చేసుకోమని, జీవితంలో చివరికి మనల్ని చూడడానికి ఒక తోడుండాలని చెప్పాను. ఆ సలహాయే వాడికి శాపమౌతుందని నేనూహించలేకపోయాను'' ఆగాడు కృష్ణమూర్తి.

''తర్వాతేమైంది?'' ఆత్రుతగా అడిగింది వసుంధర.

''శశిధర్ ఒక షరతుమీద పెళ్ళి చేసుకోవడానికి ఒప్పుకున్నాడు. కన్నెపిల్లను కాక వితంతువును చేసుకుంటానని అతని షరతు ఈ వయసులో కన్నెపిల్లను చేసుకొని ఈడులో, జోడులో ఆ అమ్మాయిని కష్టపెట్టడం మంచిది కాదని శశిధర్ అభిప్రాయం. నేను చాలా సంతోషించాను. అప్పటికైనా పెళ్ళి చేసుకుంటాడని చెప్పినందుకు.

కానీ అప్పటివరకు అన్నంటే ఎంతో ప్రేమ, అభిమానం కురిపిస్తూ భయభక్తులతో మెలుగుతున్న అతని తమ్ముళ్ళు, చెల్లెళ్ళలో ఒక్కసారిగా ధనదాహం పడగవిప్పింది.

శశిధర్‌కు పెళ్ళి జరిగి తనకంటూ ఒక కుటుంబం ఏర్పడితే అతని ఆస్తిమీద వాళ్ళకు ఏ విధమైన హక్కు వుండదనే నగ్నసత్యాన్ని వాళ్ళు భరించలేకపోయారు. ఆస్తిని తమకు భాగాలు వేసి తర్వాత పెళ్ళి చేసుకొమ్మని అతనిమీద ఒత్తిడి తెచ్చారు. శశిధర్ వాళ్ళ స్వార్థాన్ని చూచి నివ్వెరపోయాడు.

తన చేతులలో పెరిగిన తన వాళ్ళు తలాకాస్త డబ్బిస్తానని చెప్పాడు. కానీ ధనాశతో కళ్ళు మూసుకుపోయిన వాళ్ళు అతనిమీద తిరగబడ్డారు. అతన్ని ఒంటరివాడ్ని చేసి దారుణంగా హింసించారు. అతన్ని బంధించి కరెంట్ షాక్ ఇవ్వడంతో శశిధర్ పిచ్చివాడైపోయాడు. వాళ్ళు శశిధర్‌ను ఇంటినుండి తరిమేసి అతని వారసులుగా ఆస్తిని పంచుకొని అనుభవిస్తున్నారు. అన్నీ తెలిసి కూడా నేను ఏమీ చేయలేకపోయాను. రెండు మూడుసార్లు శశిధర్‌ను మెంటల్ హాస్పిటల్లో చేర్పించాలని ప్రయత్నించాను. కానీ అతను అక్కడినుండి తప్పించుకొనివచ్చి ఈ విధంగా వూర్లు తిరుగుతున్నాడు. భగవంతుడు వాడి నుదుటన ఈ విధమైన రాత రాశాడు కాబోలు!''

కృష్ణమూర్తి చెప్పిన దారుణమైన నిజం విని వసుంధర నిర్ఘాంతపోయింది. ఆ చేదును ఆమె వెంటనే జీర్ణించుకోలేకపోయింది. ఆ రాత్రి ఆమె నిద్రపోలేదు. ఆమెలో రకరకాల ఆలోచనలు చోటు చేసుకున్నాయి.

''శశిధర్‌ను ఒకప్పుడు తను ప్రేమించి వుండవచ్చు. కానీ ఇప్పుడు తనకేమౌతాడు? అతని తోడబుట్టిన వాళ్ళే అతన్ని వదిలేశారు తను ఇప్పుడు ఇంత రిస్కు తీసుకొని బాగు చేయిస్తే తర్వాత లేనిపోని ఇబ్బందులెదురౌతాయేమో! ఒకవేళ తన భర్తకి, పిల్లలకి తెలిస్తే కుటుంబంలో అనవసరమైన కలతలు తలెత్తుతాయి. కాబట్టి ఏ విధంగా చూసినా అతని విషయంలో తను తల దూర్చడం అంత భావ్యంగా లేదు. దారినపోయే దరిద్రాన్ని పిలిచి నెత్తికెక్కించుకున్నట్లుగా తన పరిస్థితి కాకూడదు. కానీ అతన్ని రోజూ అలా చూడడం భరించరాని విషయం. కాబట్టి



## అధ్యక్షుడి తొట్టె

పాశ్చాత్య దేశాలలో ఎవరింట్లోనయినా ఖచ్చితంగా ఓ పెద్ద తొట్టె స్నానానికి ఉంటుంది! టబ్‌బాత్ అంటే వారికంత ఇష్టం! అయితే ప్రపంచంలో అతిపెద్ద తొట్టె ఎక్కడ వుందో మీకు తెలుసా? విలియం హోవర్డ్‌టాఫ్ట్ అమెరికా అధ్యక్షుడుగా ఉన్న సమయంలో వైట్‌హౌస్‌లో నిర్మించిన 'టబ్' అతి పెద్దదట! ఇందులో నలుగురు కలిసి ఒకేసారి స్నానం చేయవచ్చునట! దీన్నిబట్టి టాఫ్ట్‌గారు ఎంత లావుగా వుంటారో మీరు ఊహించుకోవచ్చు.

—జూపిటర్

వేరేదైనా మార్గం ఆలోచించాలి.'


తెల్లవారబోయేముందు ఒక నిర్ణయానికొచ్చింది వసుంధర. మరునాడు దానిని తు.చ తప్పకుండా అమలుపరిచింది.

కృష్ణమూర్తి చేతిలో పదివేలు వుంచి చెప్పింది. ''ఈ వూర్లో వున్న శశిధర్‌ను ఎలాగైనా . నీ వెంట తీసుకొని వెళ్ళు: ఇక్కడికి దూరంగా ఎక్కడికైనా తీసుకెళ్ళి వదిలెయ్. వీలైతే ఈ రాష్ట్ర సరిహద్దుల్ని దాటించు. అతను జీవితంలో మళ్ళీ నా కంటపడకూడదు''

కృష్ణమూర్తి కొంచెం సేపు చేతిలోవున్న డబ్బు వంక వసుంధర వంక మార్చి మార్చి మూశాడు. తర్వాత ఆ డబ్బు సూట్‌కేసులో పెట్టుకొని ఆమె చెప్పినట్టే చేస్తానని మాటిచ్చి వెళ్ళిపోయాడు. వసుంధర గుండెల మీదనుండి పెద్ద బరువు దిగిపోయినట్లుగా ఫీలయ్యింది.

అప్పుడే రోడ్డు పక్కన టీ అంగడిలోని రేడియో నుండి వస్తున్న పాటను వినలేక ఆమె చెవులు మూసుకుంది. అయినా ఆ పాట ఆమె హృదయపు లోతుల్లో సూటిగా గుచ్చుకుంది.

''ఎవరికెవరు ఈ లోకంలో ఎవరికి ఎరుక...''




డిజైన్: ఆర్.సత్యవతి (మద్రాస్)